క్లుప్తంగా

జింకు లోపంపై చర్యలు తీసుకోవాలి

దంతాలపల్లి : యాసంగి వరి పంటలో జింకు లోపంపై తక్షణ చర్యలు తీసుకున్నట్లయితే పంటలలో వ్యాధి నిరోధక శక్తి తగ్గి దిగుబడి ఎక్కువ వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ విస్తరణాధికారి గాడిపెల్లి సందీప్ అన్నారు. మండలంలోని రామానుజపురంలో వరి పంటపొలాలను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, జింకు లోపం గుర్తించినట్లు తెలిపారు. జింకుదాతు లోపాన్ని సరిచేసుకోవడానికి రైతులు జింకు సల్ఫేట్ రెండు గ్రాములు 1 లీటరు నీటిలో ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బహుజనులకు బీఎస్పీ అండ

గూడూరు: బహుజనులకు బీఎస్పీ అండగా ఉంటుందని పార్టీ కార్యదర్శి, జోన్ ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్ అన్నారు. మండలంలోని నాయకపల్లిలో పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన సువర్ణపుర రజిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వారి వెంట జిల్లా ఇన్‌చార్జ్ దార ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు ఈసంపల్లి ఉపేందర్, దయానంద్, శ్రీను, భిక్షం ఉన్నారు.

బ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలి

తొర్రూరు: నామినేటెడ్ పదవుల్లో బ్రాహ్మణులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని బోప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ కోరారు. తొర్రూరు వాసి, బ్రాహ్మణ సంఘ నాయకుడు వింజమూరి సుధాకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సీఎం సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావును పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రాహ్మణ పరిషత్‌కు చైర్మన్‌ను నియమించాలని, పలు కార్పొరేషన్ పదవుల్లో బ్రాహ్మణులకు స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు సీతారామయ్య, వేదాంతం, పవన్, సుశీల్‌కుమార్, నీలకంఠంలు పాల్గొన్నారు.

స్టే వైరు తొలగింపు

సాక్షి స్పందన


దంతాలపల్లి : మండలం రేపోణిలో ఓ రైతు పొలంలో శుక్రవారం విద్యుత్ 'షాక్‌తో నా లుగు కోతులు మృతి' అని శనివారం సాక్షిలో ప్రచురితం కాగా విద్యుత్ అధికారులు స్పందించారు. విషయం తెలుసుకున్న మండల విద్యుత్ అధికారి జహూరుపాషా ఆ స్థలాన్ని పరిశీలించి అక్కడ అక్కడి ఉద్యోగులతో స్తంభానికి చుట్టిన స్టే వైర్ తొలిగించారు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్పందిస్తాం అని చెప్పారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పెద్దవంగర: పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి జన్మదిన వేడుకను కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, యూత్ నాయకులు శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ మాజీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి కేక్‌కట్ చేసి పార్టీ శ్రేణులకు, వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, మురళి, పూర్ణచందర్, గోపాల్, వెంకన్న, సీతారాం నాయక్, సతీష్, సంపత్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



తొర్రూరు: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మండల వాసి జాటోతు వెంకన్న ఆధ్వర్యంలో సమకూర్చిన దుప్పట్లను శనివారం డివిజన్ కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకులంలో ప్రిన్సిపాల్ వనజతో కలిసి విద్యార్థినులకు ఆమె పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు బిజ్జాల వరప్రసాద్, కిషన్‌యాదవ్, తూనం శ్రావణ్‌ల సహకారంతో స్థానిక ఉన్నత పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తండ్రి తిరుపతిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హామ్యానాయక్, హరిప్రసాద్, సోమయ్య, సంతోష్, రాజశేఖర్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డు వెటర్నరీ అసిస్టెంట్ మృతి

గార్ల: స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ వెటర్నరీ అసిస్టెంట్ ఎండీ.అబ్దుల్ అజీమ్(71) గుండెపోటుకు గురై మృతిచెందాడు. గార్లలోని పశు వైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి ఎంతో మంది రైతుల పశువులకు వైద్యసేవలు అందించిన అజీమ్ మృతిచెందడంతో రైతులు విచారం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ నేతల దోపిడీకి గురైన రాష్ట్రం

- డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్

మరిపెడ రూరల్: పదేళ్లుగా బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్ ఆరోపించారు. మండలంలోని ఎడ్జెర్లలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయం, గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అదేవిధంగా హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ వస్తే మన ఉద్యోగాలు, మన నీళ్లు, మన నిధులు వస్తాయని ప్రజలంతా ముక్తకంఠంతో కేసీఆర్‌ను సీఎంను చేశారు. చివరకు ఆయనతో పాటు ఆయన అనుచరులు తెలంగాణను దోచుకొని రూ. 6 లక్షల కోట్ల అప్పుల పాలు చేశారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాక ముందు బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం తగదన్నారు. అనంతరం గ్రామశివారు పూసలతండాలో ఎస్సారెస్పీ కాల్వ సాగు జలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు నూకల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరంగారెడ్డి, కేతిరెడ్డి సుధీర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిత్తనూరి అనూషా వెంకన్న, ఎంపీటీసీ రామన్న, మైనార్టీ నాయకులు అఫ్జల్, అప్సర్, పాల్గొన్నారు.



మరిపెడ రూరల్ : ఎడ్జెర్లలో హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామచంద్రునాయక్

వేతనాలు చెల్లించాలి

డోర్నకల్: మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందితో పాటు మెప్మా సిబ్బందికి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసన సభ్యులు డాక్టర్ రాంచంద్రునాయక్ ఆదేశించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం 35 మంది మున్సిపల్ సిబ్బందికి యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ పారిశుద్ధ్య సిబ్బందితో పాటు మెప్మా సిబ్బంది డాక్టర్ రాంచంద్రునాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఎస్‌కె బాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కాలా సుమేర్‌చంద్‌జైన్, మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, శంకర్, ఖాదర్‌బాబా పాల్గొన్నారు.



డోర్నకల్ : ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మెప్మా ప్రతినిధులు

బాధిత రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయండి

గూడూరు: భూమి కోల్పోయిన బాధిత రైతులు తమ సమస్యను కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవాలని, టెండర్ ప్రక్రియ ద్వారా జరుగుతున్న పనులను అడ్డుకోరాదని ఆర్డీఓ అలివేలు మంగమ్మ అన్నారు. చెంద్రుగూడెం సమీపం అసైన్డ్ భూమిలో నిర్మాణమవుతున్న ప్రభుత్వ ఏకలవ్య పాఠశాల పనులను శుక్రవారం అడ్డుకున్నారు. ఈ విషయాన్ని టెండర్ సంస్థ నిర్వాహకులు ఆర్డీఓకు సమాచారం అందించారు. శనివారం నిర్మాణ స్థల ప్రదేశానికి చేరుకున్న ఆర్డీఓకు భూమి కోల్పోయిన రైతులు గత 60 ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకున్నామని, ఇపుడు ప్రభుత్వ భూమి అని పాఠశాల నిర్మాణం చేపడితే తమ కుటుంబాలు నష్టపోయి రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి మాటలు విన్న ఆర్డీఓ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని, కలెక్టర్ మీ సమస్యను పరిశీలిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, డీటీ కోమల, అధికారులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మంగమ్మ

బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్



డోర్నకల్ : బహుజన్ సమాజ్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని తొడేళ్లగూడేనికి చెందిన బందెల కిరణ్‌కుమార్ నియమితులైనట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాప్పంగు మహేందర్ ప్రకటించారు. బీఎస్పీ నేతలు మాయావతి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశానుసారం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని కిరణ్‌కుమార్ తెలిపారు.

బాలికకు సన్మానం



కురవి: ఢిల్లీలో ఇటీవల జరిగిన 26 జనవరి పరేడ్‌లో పాల్గొన్న మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన నందిని శనివారం స్కూల్‌కు రావడంతో అభినందించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎం.ఎర్రయ్య, ఏటీడబ్ల్యూఓ సత్యవతిలు బాలికను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డీసీఎస్ శర్మ, హెచ్‌డబ్ల్యూఓ పద్మ, సీహెచ్.రవి, డీడీ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై జెడ్పీ సమావేశం



పెనుగొండ హైస్కూల్‌లో నమూనా జెడ్పీ సమావేశం నిర్వహిస్తున్న విద్యార్థులు

కేసముద్రం: సమ్మక్క సారలమ్మ జాతరలో పర్యావరణం పరిరక్షణపై అవగాహన పెంచుతూ, జాతరను జరుపుకునేలా మండలంలోని పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌లో 8, 9వ తరగతి విద్యార్థులచే నమూనా పర్యావరణ పరిరక్షణ జెడ్పీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. డీఈఓ సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు 4 బృందాలుగా అధికార పక్షం, అధికారులు, ప్రతిపక్షం, పత్రికా విలేకరులుగా మేడారం జాతరపై పలు అంశాలపై చర్చ జరిపారు. కాగా చైర్మన్‌గా షాజీమ్, వైస్‌చైర్మన్ ఆసియా, ఎంపీ రాసి, ఎమ్మెల్యే రామ్‌చరణ్, సీఈఓ వైష్ణవి, పాలకపక్షం అర్చన, స్నేహ, శ్యామ్, కలెక్టర్‌గా నస్రీన్, ప్రతిపక్షంగా రమ్య, లతా, వైష్ణవి, భానుప్రియ తదితరులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్‌జీసీ కోఆర్డినేటర్ గురునాధరావు, హెచ్‌ఎం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలి

తొర్రూరు: ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగేలా విద్యార్థులు కృషి చేయాలని మోటివేషనల్ స్పీకర్ రాయిపల్లి యాకయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ జయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాన్నారు.

పాడిగేదెలకు వేలం

తొర్రూరు రూరల్: అరిపిరాల గ్రామానికి వచ్చి చిక్కిపోయిన రెండు పాడిగేదెలను వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి దేవయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల క్రితం గ్రామ శివారులోకి రెండు గేదెలు వచ్చి పంట పొలాలను మేస్తుండగా సంబంధిత రైతులు పట్టుకొని జీపీ అధికారులకు అప్పగించగా, ఇప్పటికి గేదెల ఆచూకీ కోసం ఎవ్వరు కూడా రాకపోవడంతో వేలం వేస్తున్నట్లు చెప్పారు. అవసరం ఉన్న రైతులు వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తృతీయస్థానం

గార్ల: మహబూబాబాద్‌లోని రవిచంద్ర కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లిష్ మీడియంలో గార్ల నిర్మలా హైస్కూల్ విద్యార్థులు తృతీయస్థానం సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సిస్టర్ జైస్, కరస్పాండెంట్ సిస్టర్ శాలెట్‌గైడ్,అభినందించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లికి చెందిన పి.వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ శనివారం బాధిత కుటుంబానికి 1 క్వింటా బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కేజీకేఎస్ మండల అధ్యక్షుడు ఉప్పలయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

క్రైస్తవ సమాజానికి అండగా ఉంటా

పెద్దవంగర: క్రైస్తవ సమాజానికి తాను ఎప్పటికీ అందుబాటులో ఉంటానని సెయింట్ పాల్స్ స్కూల్ అధినేత, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీసెల్ కోఆర్డినేటర్ ఎంపీ ఆనంద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఈవీ థామస్ అధ్యక్షతన పాస్టర్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు క్రైస్తవులకు చేసింది ఏమి లేదన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సమాజ సేవ చేస్తున్న ఆనంద్‌కు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఇవ్వాలని థామస్ కోరారు.

మోదీ కృషితోనే రామమందిర కల సాకారం

తొర్రూరు: ప్రధాని మోదీ సమర్థ నాయకత్వంతోనే అయోధ్యలో రామమందిరం కల సాకారమైందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు, అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు సురేష్, రాజేష్, నవీన్, సంతోష్, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో టీపీటీఎఫ్ వైజ్ఞానిక సభలు

దంతాలపల్లి : ఈనెల 11, 12వ తేదీల్లో ఖమ్మంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా, వైజ్ఞానిక సభలు విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మహబూబాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్న పాఠశాల ఆవరణలో మహాసభల పోస్టర్ శనివారం ఆవిష్కరించారు.

ఏకశిలలో వెజిటేబుల్స్ డే

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఏకశిల హోలి ఏంజిల్స్ హైస్కూల్‌లో వెజిటేబుల్స్ డే వేడుకలను శనివారం పాఠశాల ఉపాధ్యాయ బృందం నిర్వహించింది. చిన్నారులకు, విద్యార్థులకు కూరగాయల విశిష్టత, రైమ్స్ గూర్చి వివరించారు.

ప్రవీణ్‌నాయక్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న భూక్య ప్రవీణ్‌నాయక్‌పై జిల్లా పార్టీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి ప్రకటించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆ పార్టీ మండల ప్రచార కార్యదర్శి మోహన్‌జీ అన్నారు. శనివారం బయ్యారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన ప్రవీణ్‌నాయక్ పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేనిఎడల పార్టీ అధిష్టానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

డోర్నకల్: మండలంలోని మన్నెగూడెం గ్రామ శివారులో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఉపేందర్‌రావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడెం గ్రామ శివారు అందనాలపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో ఎస్సై ఝాన్సీ ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహిస్తున్నారు. ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యంతో పాటు ఆటోను పట్టుకుని ఆంగోత్ హరి, బానోత్ రవిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ బిల్లు మంజూరు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల గత పీఆర్సీ, ఏరియర్స్, పెండింగ్ బిల్లులను, డీఏలను వెంటనే మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు బి.హరినాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న మూ డు డీఏలను తక్షణమే చెల్లిస్తామని అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంజీవ, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

గార్ల: ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. శని వారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో జరి గిన సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. సమావేశంలో బండ్ల అప్పిరెడ్డి, అంబటి వీరస్వామి, మౌలానా, అశోక్, నీలదేవి, టి.రమ, కృష్ణ కుమారి, రమాదేవి, కౌసల్య పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్ : బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు సత్యనారాయణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సక్రు అధ్యక్షత నిర్వహించారు.సమావేశంలో వెంకటేశ్వర్లు, రాజన్న, సత్యం, వీరన్న, దేవేందర్, సుధాకర్, వెంకన్న, వీరన్న, షేక్ తాజ్‌పాష పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్ : మాట్లాడుతున్న సత్యనారాయణ

కార్మికులను విస్మరించిన కేంద్ర బడ్జెట్



నెహ్రూసెంటర్ : గ్రామీణ వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి కేటాయింపు పెంచకపోవడం సరికాదన్నారు. జాబ్‌కార్డుకు ఆధార్, బ్యాంకు అకౌంట్ లింకు చేయడం, పని ప్రదేశాల్లో ఫొటోలు తీసి ఆన్‌లైన్ చేయడం వంటి విధానాలతో కూలీలకు పను లు దూరం చేయడమేనన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు చేపూరి గణేష్, నాయకులు గుండు సురేష్, వీరభద్రం, నాగరాజు, రవి, దర్గయ్య, శ్రీను పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

కేసముద్రం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శనివారం ఇనుగుర్తి మండలం కోమటిపల్లిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి రెండు అమలు చేశారన్నారు. త్వరలో మిగిలిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి, మాట నిలబెట్టుకుంటుందన్నారు. ఈనెల 6న ఇనుగుర్తి మండలం కోమటిపల్లి, చిన్ననాగారం గ్రామాల్లో ప్రజావేదిక కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇనుగుర్తి, కేసముద్రం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు కూరెల్లి సతీష్, అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, ధన్నసరి సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి పోలెపాక నాగరాజు, మల్లేశం, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని గాంధీపురం ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే భూక్య డాక్టర్ మురళీనాయక్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం గుగులోత్ హాల్యానాయక్ పాఠశాల ఆవరణలో ఉన్న బావితో విద్యార్థులకు ప్రమాదం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల ఆవరణంలో ఉన్న బావిపై ఐరన్‌తో చుట్టూ వెల్డింగ్ చేయిస్తామని, అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మాణానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాంగ్రెస్ వార్డు కౌన్సిలర్ చల్లాల ఉమ యాకయ్య, కోడి నాగలక్ష్మి శ్రీనివాస్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించాలి

కురవి: మండల కేంద్రంలో వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇంటిస్థలాలతో పాటు పక్కా గృహాలను కేటాయించాలని కోరుతూ మండల వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్‌కు వినతిపత్రం అందచేశారు. శనివారం అయ్యగారిపల్లిలో టీయుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్‌తోపాటు కురవి జర్నలిస్టులు విప్‌ను కలసి సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేశా రు. ఆయన స్పందించి తహసీల్దార్ సునీల్‌రెడ్డికి ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో సర్వే చేసి వారంరోజుల్లో రిపోర్ట్ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, జనార్ధన్‌రెడ్డి, నాగన్న పాల్గొన్నారు. టీయుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీని వాస్‌ను సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన గంధసిరి రవిని సన్మానించారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

పాఠశాలల్లో స్వయంపాలన దినోత్సవం

మహబూబాబాద్ అర్బన్/తొర్రూరు/దంతాలపల్లి: మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి పాఠశాలలో, తొర్రూరు, దంతాలపల్లిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వయంపాలన దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డీఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, వివిధ సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయులుగా వ్యవహరించారు అనంతరం ప్రతిభగల వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కిషన్ నాయక్ ఉపాధ్యాయులు పా ల్గొన్నారు. తొర్రూరు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈఓగా వెంకట వరప్రసాద్, హెచ్‌ఎంగా వర్ష, పలు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్‌ఎం లక్ష్మీనారాయణ బహుమతులు అందించారు. దంతాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శని వారం విద్యార్థులే ఉపాధ్యాయులు, ఉన్నత అధికారులుగా, తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.



మహబూబాబాద్ అర్బన్ : జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



దంతాలపల్లి: ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



తొర్రూరు: స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జీపీ మాజీ పాలకవర్గాలకు ఘనసన్మానం



మహబూబాబాద్ రూరల్ : సన్మానం పొందిన మాజీ సర్పంచ్ షఫియుద్దీన్, వార్డు సభ్యులు



డోర్నకల్‌లో..



కురవిలో..

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్/ మరిపెడ రూరల్/కురవి: ఐదేళ్ల పదవీ కాలంలో అందరికి తలలో నాలుకలా ఉంటూ సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రజలు దైవసమానులని లక్ష్మీపురం (బి), అందనాలపాడు సర్పంచ్‌లు ఎండీ.షఫియుద్దీన్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం (బి) గ్రామస్తుల ఆధ్వర్యంలో సర్పంచ్, వార్డ్ సభ్యులను శనివారం ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్, వార్డు సభ్యులను గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కురవి: మండలంలోని నేరడ శివారు ఎల్కచెట్టు తండా, చీమ్లా తండా జీపీలకు చెందిన పాలకవర్గ సభ్యులను ఎంపీపీ గుగులోత్ పద్మావతి రవినాయక్‌లు శనివారం సన్మానించారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులను సత్కరించారు.

గార్లకు బస్సు సౌకర్యం కల్పించాలి

గార్ల: జిల్లా కేంద్రం నుంచి గార్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు కలెక్టర్ కార్యాలయం, జిల్లా కోర్టు, ఆర్డీఓ కార్యాలయానికి రావాలంటే ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఆటోల్లో ఇబ్బందులు పడుతూ రావల్సి వస్తుందని వాపోతున్నారు. కొత్తగా మహబూబాబాద్ జిల్లా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు బస్సు సౌకర్యం కల్పించలేదు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు.

ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రంస్టేషన్ శివారు కిష్టాపురం కాలనీకి చెందిన కొంగరి శ్రీనివాస్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ మేరకు అతడికి వైద్యఖర్చుల కోసం కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్ఎస్ 1993–94 టెన్త్ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు శనివారం రూ.28వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. రవి, ధర్మాచారి, స్వామి, అబ్జల్, కరుణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.